భీమిరెడ్డి ఆశయ సాధనకు కృషి

- విగ్రహావిష్కరణ సభలో వక్తలు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్. చిత్రంలో మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యేలు, తదితరులు

గుంతకల్లు: భీమిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దామని విగ్రహావిష్కరణలో పాల్గొన్న అతిథులు పిలుపునిచ్చారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. తండ్రి భీమిరెడ్డి చూపించిన దారిలో నడుస్తూ.. ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. 1983 నుంచి నేటి వరకూ ప్రజల్లోనే ఉంటూ వారి కష్టాలను తమ కష్టాలుగా భావించి ముందుకు సాగుతున్నామన్నారు. ఎళ్లవేళలా మీ ఆదరాభిమానాలు ఉండాలని ఆకాంక్షించారు. ఎలాంటి శతృత్వం లేని కుటుంబం యల్లారెడ్డి భీమిరెడ్డిది అని ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవకు అంకితమయ్యారని కొనియాడారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో యల్లారెడ్డి కుటుంబం తెలియని వారుండరన్నారు. భీమిరెడ్డి ఎంతో ప్రజాభిమానం పొందిన నాయకుడు. పేద ప్రజలు, రైతుల పట్ల ఎంతో ప్రేమాభిమానాలు కలిగి ఉండి గొప్ప మానవతవాదిగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. కర్నూలు, అనంతపురం రెండూ జిల్లాల్లో భీమిరెడ్డి కుటుంబానికి ఆదరణ ఏమాత్రం తగ్గలేదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆయన చిన్నవయస్సులో చనిపోయినప్పటికీ ఆయన కుమారులు ముగ్గురు శాసనసభ్యులు, మరొకరు శాసనమండలి సభ్యులుగా కొనసాగుతున్నారంటే అది భీమిరెడ్డి అభిమానమేనన్నారు. ఎంతో క్రమశిక్షణగా ఉంటూ ఆయన ఆశయాల సాధనకు పాటుపడుతున్నారన్నారు. భీమిరెడ్డి కుమారులు మరిన్ని పదవులు అధిరోహించాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆకాక్షించారు. భీమిరెడ్డి కుటుంబంతో తమకు ఎన్నో ఏళ్లుగా మంచి సత్సంబంధాలున్నాయన్నారు. ఆయన విగ్రహావిష్కరణలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పేరుకు భీమిరెడ్డి కాదు నిజంగా గట్టితనంలో కూడా భీముడే అని రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రాజకీయంలో శారీరకంగా ఎంత గట్టో మానసికంగా కూడా ఆయన చాలా గట్టివారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, కర్నూలు బాలసాయిబాబా స్వామి తదితరులు భీమిరెడ్డి కృషిని కొనియాడారు.

పరామర్శ..

గుంతకల్లుటౌన్: అనారోగ్యం కారణంగా విశ్రాంతి పొందుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మాతృమూర్తి వై.లలితమ్మను రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం ఇతర ప్రముఖులు పరామర్శించారు. సోమవారం కొనకొండ్ల రోడ్డులో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి విగ్రహావిష్కరణకు హాజరైన మంత్రులు ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని లలితమ్మ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ప్రభుత్వ విప్‌లు కాపురామచంద్రారెడ్డి, వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, అనంతవెంకటరామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ జనసందోహం

గుంతకల్లు: కొనకొండ్ల రోడ్డులోని ఎంబీఏ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన భీమిరెడ్డి పార్కు, విగ్రహావిష్కరణకు భారీగా జనాలు తరలి రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. దాదాపు 30 వేల మందికిపైగా హాజరైనట్లు అంచనా. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అన్యూహ స్పందన లభించింది. కార్యక్రమంలో భీమిరెడ్డి కుటుంబ సభ్యులు వై.ప్రదీప్‌రెడ్డి, వై.కపీలేశ్వరరెడ్డి, వై.భీమరెడ్డి, వై.నైరుతిరెడ్డి, నిషతరెడ్డి, జయమనోజ్‌రెడ్డి, ధరణీరెడ్డి, మంజునాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని (గుంతకల్లు), వన్నూర్‌బీ (గుత్తి), వైస్ చైర్మన్ మైమూన్, ఎంపీపీ బి.మాధవి, మాజీ మున్సిపల్ చైర్మెన్లు ఎస్.రామలింగప్ప, జింకల రామాంజినేయలు, మండల కన్వీనర్ బి.మోహన్, మాజీ పట్టణ కన్వీనర్ బీ.శంకర్, సచివాలయ మండల కన్వీనర్ గోవిందునాయక్ పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ సభకు హాజరైన అశేష జనవాహిని

గుత్తిలో తేనేటీ విందు..

గుత్తి: పట్టణంలో మాజీ ఎంపీపీ, డోన్ ఎన్నికల పరిశీలకుడు కోనా మురళీధర్‌రెడ్డి, శ్రీలత దంపతుల ఇంటిలో సోమవారం జరిగిన తేనీటి విందుకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా చేయాలని బుగ్గనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, చౌదరి శివ కుమార్, సీనియర్ నాయకులు జాన్ సునీల్, కోనా నిషాంత్ రెడ్డి, ఖాసీం, గంగరాజు, వేణు, గౌస్, బింగి బాబు, కౌన్సిలర్లు వాల్మీకి శివ, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో ఎమ్మెల్యే దుద్దుకుంట



తులాభారం ద్వారా స్వామికి బెల్లం కానుకగా సమర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం వేకువజామున ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేర్లతో ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ప్రసాదం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తులాభారం ద్వారా స్వామికి బెల్లం కానుకగా సమర్పించారు.

ఆదాయ వనరులు కల్పించాలి

యాడికి: వృథాగా ఉన్న ప్రభుత్వ బిల్డింగులను వేలం వేసి పంచాయతీకి ఆదాయ వనరులను కల్పించాలని మండలంలోని పెండేకల్ గ్రామానికి చెందిన నారాయణ స్వామి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ.. యాడికి గ్రామ పంచాయతీలో గాంధీజీ విగ్రహం ఎదురుగా ఉన్న బిల్డింగులోని కాంప్లెక్స్‌లో ఒక రూము ఎస్సీ వారికి కావాలని ఓ వ్యక్తి అడగటం సమంజసం కాదన్నారు. దీంతో 2018 నుంచి యాడికి గ్రామ పంచాయతీ ఆదాయం కోల్పోతుందన్నారు. ఎస్సీల్లో 61 కులాలు ఉన్నాయని, ఆ రూముకు సంబంధించి వేలం పాట నిర్వహిస్తే అందరూ వేలం పాటలో పాల్గొంటారన్నారు.

కల్లబొల్లి మాటలు చెప్పేవాడిని కాదు

- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- ఉత్సాహంగా సాగుతున్న ప్రజా సంక్షేమ యాత్ర



కూలీలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: గ్రామీణ స్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారం, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. సోమవారం మండలంలోని కాశేపల్లి గ్రామం నుంచి 9వ రోజు ప్రజా సంక్షేమ యాత్ర కొనసాగింది. చిత్రచేడు గ్రామం నుంచి దారి పొడవునా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ కూలీలు, గొర్రెల కాపర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గొర్రెలు, పశువులకు రోగాలు వస్తే వెటర్నరీ సిబ్బంది సకాలంలో మందులు పంపిణీ చేస్తున్నారా లేదా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గతంలో జేసీ సోదరులు అధికారంలో ఉన్నప్పుడు ఎంత దారుణంగా వ్యవహరించేవారో మీకే అర్థమై ఉంటుందని అన్నారు. గతంలో ప్రజలను మోసం చేసి 30 ఏళ్ల కల్లబొల్లి మాటలు చెప్పి వెళ్లిపోయేవారన్నారు. నేను అలాంటి వ్యక్తిని కాదని, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి ప్రతి గడపకూ తిరిగానని తెలిపారు. నవరత్నాల్లోని పథకాలను పార్టీలకు అతీతంగా అందించడం జరుగుతోందని స్పష్టం చేశారు. చిట్టూరు నుంచి తరిమెలకు వెళ్లే రహదారి లేక ప్రజలు ఎంత ఇబ్బందులు పడుతున్నారో జేసీ సోదరులకు చెప్పినా పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిన తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చిట్టూరు మీదుగానే సాగిందని పేర్కొన్నారు. ఆ సమయంలో మీ కష్టాలను ఆయన చూశారు. విన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే మీ కష్టాలను ముఖ్యమంత్రి చిట్టూరు నుంచి తరిమెలకు పెన్నానదిపై బ్రిడ్జి నిర్మించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. త్వరలో టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యాత్ర గంజిగుంటపల్లి మీదుగా పి.వీరన్నపల్లికి చేరుకుంది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్టారెడ్డి, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కంచం రామ్మోహన్, కందుగోపుల మురళి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, మాజీ ఎంపీపీ రఘునాథరెడ్డి, ఉమామహేశ్వరెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి లక్కు రామచంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పోశం రంగస్వామి యాదవ్, వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రామాంజినేయులు, నాగేంద్ర, శేషారెడ్డి, బీసీ విభాగం నాయకుడు వెంకటస్వామి గౌడ్, చిట్టూరు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ ధనలక్ష్మి, నాగిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, కేశవరెడ్డి, రాము, కాశేపల్లి సర్పంచ్ యాపర్ల కృష్టారెడ్డి, నాగభూషణ, ఆంజనేయులు, రామచంద్ర, జయలక్ష్మీరెడ్డి, రాఘవేంద్ర, దేవమోహన్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, కొండారెడ్డి, రమణారెడ్డి, మహేశ్వరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పార్వేట ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో రంగనాథుడు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు సోమవారం స్వామికి హంసవాహనం, పార్వేట, అశ్వ వాహనం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చారణల నడుమ స్వామికి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై ఉంచి గ్రామంలోని జమ్మి చెట్టు వరకూ ఊరేగించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి కల్పించారు. ఆలయ పరిసరాల్లో భారీ ఎత్తున అంగళ్లు వెలిశాయి. జాయింట్ వీల్, భారీ ఊయలలు, చెరకు విక్రయించే అంగళ్లు, మిఠాయిలు, పిల్లల ఆట వస్తువులు తదితర అంగళ్లను ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ దేవదాసు, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్, సురేష్, సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: కడప జిల్లా కొండాపురం సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో నివాసముండే బాలు పని మీద ద్విచక్ర వాహనంలో కడపకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలు దేరాడు. అయితే మార్గంమధ్యలోని కొండాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో బాలు తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వచ్చిన వారు అతడ్ని కారులో గుత్తికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కొత్తూరులో వృద్ధురాలికి..

గుత్తి: పట్టణంలోని కొత్తూరులో నివాసముండే నారాయణమ్మ అనే వృద్ధురాలు సోమవారం ప్రమాదవశాత్తూ జారి కింద పడింది. ఈ ఘటనలో గాయపడిన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యాంగ్లర్ తగిలి మహిళకు..

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీలో నివాసముండే వెంకటమ్మ దుస్తులు ఆరవేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ ఇనుప యాంగ్లర్ తలకు తగిలింది. రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



భోగేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో మాఘ మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివమాలధారులు, భక్తుల ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మాఘ బహుళ శుభలగ్నంలో ఆదిదంపతుల వివాహాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ప్రధాన అర్చకుడు రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు చంద్రా, అనిల్ మంత్రోచ్చారణల నడుమ శివనామస్మరణ, మంగళవాయిద్యాల మధ్య పార్వతీ పరమేశ్వరులకు వివాహం జరిపించారు. అనంతరం దాదాపు 3 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

11న సుబ్రహ్మణ్యేశ్వరుడి గ్రామోత్సవం

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11వ తేదీన గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల సందర్భంగా కోటంక నుంచి పల్లకీలో స్వామిని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు.

క్లుప్తంగా

సచివాలయాల్లో ఆధార్ సేవలు

పుట్లూరు: మండలంలో మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. 7న కోమటికుంట్ల, చెర్లోపల్లి, ఎల్లుట్ల, తక్కళ్లపల్లి, 8న శనగలగూడూరు, 10న పుట్లూరు, అరకటివేముల, మడుగుపల్లి, కందికాపుల, 11న సూరేపల్లి, బాలాపురం గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు.

అశ్వవాహనంపై కొండమీద రాయుడి వైభవం



బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయడి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కొండమీదరాయుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ మంగళ వాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు స్వామికి హారతులు పట్టి, భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

నేడు బ్రహ్మోత్సవాల ముగింపు

కొండమీద వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. ఉదయం 8 గంటలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థావాది వసంతోత్సవం నిర్వహించనున్నారు. అదే విధంగా రాత్రి 8 గంటలకు కొండమీదరాయుడు హంస వాహనంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారన్నారు.

మంచి మార్కులు సాధిస్తే బంగారు భవిష్యత్తు

నార్పల: ప్రతి విద్యార్థి బాగా చదివి మంచి మార్కులు సాధిస్తే బంగారు భవిషత్తు ఉంటుందని ఎస్‌కేసీ సేవా సమితి అధ్యక్షుడు కమల్‌నాథ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్న తస్థాయికి చేరుకోవాలన్నారు. అలాగే క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవా ధృక్పథం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కవి, రచయిత రఘురామయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పామిడి: స్థానిక 4వ వార్డుకు చెందిన ఇల్లూరు చంద్రశేఖర్ (77) సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే మృతి చెందిన రామగిరి ధనుంజయ కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, సుధాకర్, శివ, యుగంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియామకం

తాడిపత్రి టౌన్: జాతీయ చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని చేనేత కాలనీకి చెందిన నరసింహులును నియమించినట్లు రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు రుషింగప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

'స్పందన'కు మూడు ఫిర్యాదులు

యల్లనూరు: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి మూడు వినతులు అందాయన్నారు. ఇంటి పట్టాలు, తాగునీరు తదితర సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుప్రజ, ఆరోగ్య పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శంకర్, ఏపీఎం ముత్యాలప్ప, ఎమ్మార్సీ సిబ్బంది ప్రదీప్, లైన్‌మెన్ ఓబులేసు పాల్గొన్నారు.

సమస్యలపై అవగాహన ఉండాలి

గుంతకల్లు రూరల్: విద్యార్థులు కేవలం మన దేశం గురించి మాత్రమే కాకుండా ప్రపంచం, ఇతర దేశాల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ త్రిశాల బన్సాలి సూచించారు. ప్రపంచ అభివృద్ధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ సమస్యలపై 8 ,9 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అశ్వత్థం హుండీ ఆదాయం రూ.7.44 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దపప్పూరు: అశ్వత్థంలో తిరునాల సందర్భంగా భక్తులు హుండీల్లో వేసిన కానుకలను సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.7.44 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కేవలం తాత్కాలిక హుండీలను మాత్రమే లెక్కించామని, పర్మినెంటు హుండీలను లెక్కించలేదన్నారు. గత పదేళ్లలో తాత్కాలిక హుండీల ద్వారా కేవలం రెండు రోజుల వ్యవధిలో ఇంత పెద్ద మొత్తం కానుకల రూపంలో రావడం ప్రథమమన్నారు.

ఘనంగా రామకోటి తిరునాల



స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులు

పెద్దపప్పూరు: మాఘమాసాన్ని పురస్కరించుకుని అశ్వత్థంలో మూడో ఆదివారం మరుసటి రోజు సోమవారం జరిగే రామకోటి తిరునాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సీతారాములను దర్శించుకున్నారు. తొలుత భక్తులు ఆలయం సమీపంలోని పెన్నానదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇక్కడ వెలసిన సీతారాములను కేవల ఏడాదికి ఒకసారే భక్తులు దర్శించుకోవడం విశేషం. తిరునాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ఖాజాహుస్సేన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

లయన్స్‌క్లబ్ సేవలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

తాడిపత్రి టౌన్: లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునివేలు పట్టణ ప్రజలకు సూచించారు. స్థానిక శ్రీ కృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో సోమవారం లయన్స్‌క్లబ్, అరవింద నారాయణరెడ్డి, అనంతపురం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గుండె, కంటి, ఆర్థో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి గుండె పరీక్షలు నిర్వహించి, వారిలో 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామన్నారు. 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించి.. 106 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఆర్థోకు సంబంధించి 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు హరినాథ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ మహిళా క్లబ్ అధ్యక్షురాలు రాజేశ్వరి, లయన్స్‌క్లబ్ పీడీజీ రమేష్‌నాథ రెడ్డి, కిమ్స్ సవేరా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాచకులకు మాంసాహార విందు

పెద్దపప్పూరు: అశ్వర్థం తిరునాలకు విచ్చేసిన యాచకులకు పెద్దపప్పూరు గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు సోమవారం తప్పెట్లతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారికి మాంసాహార విందు ఏర్పాటు చేశారు. తాత ముత్తాతల నుంచి యాచకులకు మాంసహార విందు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

ఇంటి పన్ను వసూలు చేయండి

యల్లనూరు: ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఈఓఆర్డీ విజయశేఖర్ నాయుడు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ అంత్యోదయ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచాలన్నారు. అలాగే ఓటరు కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం, మ్యాపింగ్ , ఆయుష్మాన్ భారత్‌పై చర్చించారు.

సమస్యలు పరిష్కరించాలి

శింగనమల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం శింగనమలలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నియోజకవర్గ సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. మండలంలోని కల్లుమడి, నిదనవాడ, ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి, సలకంచెరువు గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలున్నారన్నారు. వారికి ఇంటి స్థలంతో పాటు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

యాప్‌ల నిషేధం హర్షణీయం

గుంతకల్లుటౌన్: చైనా మొబైల్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడం హర్షణీయమని బీజేపీ ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెట్టింగ్, లోన్ యాప్‌ల పేరిట యువతను అప్పుల ఊబిలోకి నెట్టేసిన 232 (138 బెట్టింగ్, 94 లోన్) చైనా యాప్‌లపై కొరఢా ఝుళిపించడం సంతోషకరమన్నారు. ఈ యాప్‌లను బ్యాన్ చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు హరిహరనాథ్, కృష్ణమూర్తి, గుర్రం సూర్యనారాయణ, లావణ్య, సతీష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కుళాయి కనెక్షన్లను తొలగిస్తాం

నార్పల: అనుమతి లేకుండా అక్రమంగా వేసుకున్న కుళాయి కనెక్షన్లకు మూడు రోజుల్లోపు అనుమతి తీసుకోవాలని లేకుంటే వాటిని తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా వేసుకున్న కుళాయి కనెక్షన్లకు వెంటనే పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి అనుమతి తీసుకోవాలన్నారు. లేకపోతే పంచాయతీరాజ్ చట్టం కింద జరిమానా విధించి, కేసులు నమోదు చేస్తామన్నారు.